క్లుప్తంగా

ప్రజారక్షణ భేరి విజయవంతానికి ప్రచారం

తాడేపల్లిరూరల్: విజయవాడలో ఈనెల 15న సీపీఎం ఆధ్వర్యాన నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు సోమవారం కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై అనేక భారాలు వేస్తూ వచ్చిందని, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధంగా చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.కె.ఖాసింవలి, సీహెచ్ శ్రీను, ఎం.శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

విమర్శించే అర్హత టీడీపీకి లేదు

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను విమర్శించిన టీడీపీ నాయకులు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అందించిన సహాయం శూన్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కలిస్తూ గత ప్రభుత్వాల కంటే ఎక్కువగా మంత్రి పదవులు కల్పించారన్నారు. చంద్రబాబు నాయుడు తన మంత్రివర్గంలో కనీసం ఒక్క మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జానీ సైదా, పఠాన్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

బీఎల్వోలు క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించాలి



మంగళగిరి: బీఎల్వోలు మరోసారి ఓటర్ల జాబితాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నూతన జాబితాలతో ప్రతి బీఎల్వో క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్లను విచారించి తమ ఓటులో ఏమైనా తప్పులుంటే సరిదిద్దేలా చూడాలన్నారు. అంతేకాక 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఒకే డోర్ నెంబర్‌లో అధిక ఓటర్లుతో పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్వో లక్ష్మీకుమారి, అసిస్టెంట్ ఈఆర్వో కె హేమమాలిని పాల్గొన్నారు.

82 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ, 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు పి.ఎస్తేరురాణి శిబిరంలో 82మందికి వైద్యపరీక్షలు చేశారు. అందులో 40మందికి బీపీ, షుగర్ ఉన్న వారికి రక్త, మూత్ర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, 104వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, సింగరాజు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం ఆడిట్‌పై ప్రజావేదిక

తాడికొండ: తాడికొండ మండల పరిధిలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ పూర్తయినందున మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక ఏర్పాటు చేశామని, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని తెలిపారు.

నేడు ఆచార్య ఎన్జీ రంగా జయంతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తమ పార్లమెంటేరియన్, రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 8:30 గంటలకు బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సోమవారం తెలిపారు. ఆయన అభిమానులు, రైతాంగ శ్రేయోభిలాషులు పాల్గొనాలని కోరారు.

కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

లక్ష్మీపురం: కుల గణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అవగాహన సంస్థ స్వాగతిస్తుందని, సక్రమంగా చట్టబద్ధత కల్పించి నిర్వహించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విశ్లేషకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు అయితేనే కుల గణన నమ్మకంగా సాగుతుందని అన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు
- విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మంగళగిరి: రాష్ట్రం ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు అన్నారు. నగరంలోని పార్కు రోడ్డులోని 19వ సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని అసిస్టెంట్ కమిషనర్ సందర్శించారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని, కుటుంబాన్ని జల్లెడ పట్టి ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రజలకు ఒక్క రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షపై రోగులు సంతోషంగా వైద్య సేవలందుకుంటున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి ఒక్కరికి వైద్య సేవలందించే లక్ష్యంగా కొనసాగుతుండగా జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వార్డు గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఇళ్ల వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించడంతో ఉచితంగా మందులు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదని జగనన్న ఆరోగ్య రక్ష అనేది వైద్య సేవలందించడంలో ఓ బృహత్తర కార్యక్రమమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణయించిన చోటే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలి

- అన్ని జాగ్రత్తలను షాపు యజమానులే తీసుకోవాలి
- తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగిరెడ్డి, పాల్గొన్న వివిధ శాఖ అధికారులు, షాపు యజమానులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్, పట్టణ పరిధిలో బాణసంచా విక్రయించే యజమానులు తప్పనిసరిగా నిర్ణయించిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, తాడేపల్లి ఎస్ఐ వినోద్‌కుమార్, మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు విద్యుత్‌శాఖ నులకపేట ఏఈ షణ్ముఖలతో కలసి బాణసంచా షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ నాగిరెడ్డి మాట్లాడుతూ బాణసంచా అమ్ముకునేవారు ముందుగా రెవెన్యూ, విద్యుత్‌శాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్‌శాఖ అనుమతులు తీసుకోవాలని, అనంతరం రెవెన్యూ అధికారులు సూచించిన ప్రదేశంలో మాత్రమే షాపులను ఏర్పాటు చేయాలని, తాడేపల్లిలో ఏర్పాటు చేసే బాణసంచా షాపులను అన్ని శాఖలు కలసి ఉండవల్లి అమరావతి రోడ్డులోని దేవదాయశాఖ భూముల్లో ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని, ఎవరైతే షాపులు పెట్టదలచుకున్నారో వారికి ఎంత స్థలం కావాలి? ఎంత స్టాక్ పెడుతున్నారనే విషయాలను తప్పనిసరిగా తెలియజేయాలని, షాపు పెట్టే సమయంలో అన్ని జాగ్రత్తలను తీసుకోవడంతోపాటు ప్రమాదాలు జరిగినపుడు వాటిని నివారించడానికి అవసరమైన సామాగ్రిని సైతం షాపు యజమానులే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్ఐ వంశీకృష్ణ, వివిధ సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుపై సమావేశం

మంగళగిరి: దీపావళి పండుగ నేపథ్యంలో నగరంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారులు సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు. బాణసంచా దుకాణాల కారణంగా ప్రజలు ఇబ్బంది లేకుండా ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటూ మంగళగిరి పట్టణం నిడమర్రు రైల్వే గేటు వద్ద డంపింగ్ యార్డు స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బాణసంచా డీలర్లు మాత్రం అందుకు అంగీకరించకుండా పట్టణం నడిబొడ్డున దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ బాణసంచా దుకాణాలను నిడమర్రు రైల్వే గేటు వద్ద డంపింగ్ యార్డు స్థలంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీలర్లు అక్కడ ఏర్పాటు చేసేందుకు రైల్వేగేటును సాకుగా చూపుతున్నారన్నారు. అనుమతుల మంజూరు విషయంపై మంగళవారం నిర్ణయం తీసుకుని నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్పొరేషన్ అభివృద్ధికి రోడ్ల విస్తరణ తప్పనిసరి

- ప్రజలు సహకరించాలి
- కమిషనర్ యు.శారదాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ యు శారదాదేవి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ మరింత శరవేగంగా అభివృద్ధి చెందాలంటే రహదారుల విస్తరణ తప్పనిసరి అని కార్పొరేషన్ కమిషనర్ యు శారదాదేవి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం తెనాలి రోడ్డు విస్తరణలో భాగంగా మిద్దె సెంటర్ నుంచి వడ్లపూడి సెంటర్ వరకు ఉన్న దుకాణదారులు, నిర్వాసితులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారు. పలువురు దుకాణదారులు, నిర్వాసితుల అభిప్రాయాలను సేకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందన్నారు. చేనేత వస్త్ర దుకాణదారులందరికి నగర నడిబొడ్డున చేనేత భవనం నిర్మాణం పూర్తి చేసి దుకాణాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరికి ఎలాంటి నష్టం లేకుండా ప్రభుత్వ స్థలంలోని ఆక్రమణల తొలగింపుతో పాటు రోడ్డుకు అవసరమైన మేరకు స్థలం సేకరించి వారికి నిబంధనలకు అనుగుణంగా తగు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. 2006 మాస్టర్ ప్లాన్ ప్రకారమే రోడ్డు విస్తరణ చేపడుతున్నామని రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుమారుడు కనిపించడం లేదంటూ ఫిర్యాదు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరులో నివాసముండే ఓ వ్యక్తి కనిపించడం లేదంటూ ఆ వ్యక్తి తల్లి సోమవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లి కొత్తూరుకు చెందిన బొమ్మారి కోటేశ్వరమ్మ భర్త మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తెకి, కుమారుడికి వివాహం కాగా, పెద్ద కుమార్తెకు వివాహం కాలేదు. కుమారుడైన ఉదయ్ ఆస్తిని తన పేరుమీద రాయాలని ఒత్తిడి తీసుకువస్తున్నాడు. కోటేశ్వరమ్మ తన పెద్ద కుమార్తెకు కూడా ఇస్తానని చెప్పడంతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. తన కుమారుడు మిస్సింగ్‌పై తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ తెలిపారు.

ప్రజలతో సత్సంబంధాలు అవసరం

గుంటూరుఎడ్యుకేషన్: ప్రజలతో సత్సంబంధాలను నెలకొల్పడంలో కమ్యూనికేషన్ ఎంతో కీలకమని ఏఎన్‌యూ జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ జి.అనిత పేర్కొన్నారు. సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో కార్పొరేట్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఎంబీఏ విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ అనిత మాట్లాడుతూ కమ్యూనికేషన్ అనేది పెద్దకళ అని, ప్రజా సంబంధాలను అభివృద్ధి పర్చడంలో కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఎంతో అవసరమన్నారు. శ్రద్ధగా వినడం, వినియోగదారుని మనసులో బ్రాండ్ ఇమేజ్ ముద్ర వేయడంతోపాటు విపత్కర పరిస్థితుల్లో సత్వర నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమన్నారు. కార్పొరేట్ ఎథిక్స్‌ను కలిగి ఉండటంతోపాటు చర్యల ద్వారా కంపెనీ ప్రతిష్టను పెంచుకోవడం, సాంకేతిక సామర్థ్యాన్ని కలిగి ఉండటం తప్పనిసరి అని వివరించారు. దూరదర్శన్ ప్రతినిధి రవిశంకర్ మాట్లాడుతూ మీడియా ద్వారా ఆధునిక వ్యాపారం నడుస్తోందని, మీడియాతో సత్సంబంధాలను కలిగి ఉండటం ద్వారా సమాజ పోకడ తెలుస్తుందన్నారు. ఆధునిక వ్యాపార శైలిని అవగాహన చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ రీసెర్చ్ స్కాలర్ ఒలీవ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ గేమ్స్ గురించి విద్యార్థులకు వివరించారు.

పాఠశాల ఆవరణలో స్వచ్ఛ భారత్



పాఠశాల పిచ్చి మొక్కలు పీకుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నిడుముక్కల(తాడికొండ): తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక వి/ాన కళాశాల విద్యార్థులు సోమవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ ఆవరణలో ఉన్న మొక్కలను తొలగించి ఊడ్చి పరిశుభ్రం చేశారు. త్వరలో మొక్కలు నాటనున్న నేపథ్యంలో స్థలాన్ని ఎంపిక చేసి చదును చేశారు. పలువురు గ్రామస్తులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

జీఎంసీ అదనపు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్


నెహ్రూనగర్: ప్రజల నుంచి స్పందనలో అందే ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం చేయాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 23 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఏసీపీలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల విజయవాడలో జరిగిన 22వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభకనబరిచారని ఏఎస్ జూడో కరాటే అకాడమీ ఎండీ ఆలపాటి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ అకాడమీ నుంచి 11 మంది పాల్గొనగా ముగ్గురు బంగారు, నలుగురు రజిత, నలుగురు కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులను కోచ్ ఎ.లక్ష్మీ ప్రసన్న కుమారి, చీఫ్ కోచ్ పి.రాంబాబు అభినందించారు.

బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



నెహ్రూ నగర్: బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ క్రెడాయి గుంటూరు చైర్మన్ సతీష్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. సోమవారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం చేశారు. ఆయన మాట్లాడుతూ పురపాలక శాఖ నిబంధనలకు అనుగుణంగానే పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు టీడీఆర్ బాండ్లు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం సదరు టీడీఆర్ బాండ్లు ద్వారా సమర్పించిన అప్లికేషన్లు ప్రభుత్వం నిలిపివేయడంతో ప్లాన్ అప్రూవల్ వచ్చి బిల్డింగ్ నిర్మాణం పూర్తయిన వాటికి కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా బిల్డర్ల దగ్గర ఫ్లాట్లు కొన్న సామాన్య ప్రజానీకం ఎంతో ఇబ్బంది పడుతున్నారని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యకు తగిన పరిష్కారం చూపేలా చొరవ చూపాలన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో అధ్యక్షుడు మామిడి రాము, సెక్రటరీ వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

37 మంది బాధితులకు రూ 28లక్షలు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు అప్పుల పాలు కాకుండా సీఎం సహాయనిధి వారి కుటుంబాలకు అండగా నిలబడడం సంతోషకరమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి 37 మందికి రూ.28లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మి విద్య, వైద్యరంగాలపై వేలాది కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వర్తించని బాధిత కుటుంబాలు అప్పుల పాలుకాకుండా సీఎం సహాయనిధి నుంచి నిధులు అందజేస్తూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నాణ్యమైన ఉచిత వైద్య అందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర హామీలను నెరవేర్చిన సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కత్తెర సురేష్‌కుమార్
- కార్యాలయంలో కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ



కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్న కత్తెర సురేషకుమార్

తాడికొండ: ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజాసంకల్ప యాత్రలో చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన జగనన్నకు నేడు రాష్ట్రంలో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర నిర్వహించి ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం గుంటూరులోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కత్తిరించి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రతి పేదవాడి కష్టాన్ని అతి దగ్గరగా చూసిన జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు మేలు చేశాయనేందుకు నేడు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, అభిమానాలే నిదర్శనమన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ నాలుగున్నరేళ్ళ అధికారంలో జగనన్న చేసిన సంక్షేమ మేలులు అందాయనడంలో సందేహం లేదన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకం రాలేదని చెప్పే దమ్ము ఏ ఒక్కరికైనా ఉందేమో ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించుకోవాలన్నారు. ప్రజలందరికీ ఉచితంగా విద్యా, వైద్యం అందించాలనే ఏకైక లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాడు- నేడు ద్వారా పాఠశాలల ఆధునీకరణ, ఇంగ్లీషు మీడియం విద్య పేదింట ఆణిముత్యాలను వెలికితీసి సమాజానికి అందించడం ఖాయమన్నారు. వైద్య రంగాన్ని సైతం పటిష్టం చేసిన జగనన్న ప్రభుత్వం ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం ప్రతి పేదవాడి గుండె తలుపులు తట్టిందనడంలో సందేహం లేదన్నారు. నాలుగున్నరేళ్ళలో సంక్షేమం కోసం రూ.2.34 వేల కోట్లుబటన్ నొక్కి ప్రజల ఖాతాలో జమ చేసిన జగనన్న పాలనకు 14 సంవత్సరాలు అధికారంలో ఉండి పేదలకు రావాల్సిన సంక్షేమాన్ని పక్కదారి పట్టించి తన వారికి దోచిపెట్టుకున్న బాబుకు వ్యత్యాసం ఏమిటో ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. కార్యక్రమంలో ఫిరంగిపురం ఎంపీపీ సహేలా నర్గిస్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, మార్పుల శివరామిరెడిడ, కొప్పుల శేషగిరిరావు, తాళ్లూరి వంశీకృష్ణ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.75 లక్షలతో డ్రెయిన్‌ల నిర్మాణం



పెనుమాకలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రూ.75 లక్షల వ్యయంతో డ్రెయిన్‌ల నిర్మాణ పనులు చేపట్టారు. డీఈ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరంలో జీయర్‌స్వామి ఆశ్రమం వెనుక నుంచి బోటు యార్డు రోడ్డు వరకు డ్రెయిన్‌లు నిర్మించాలని ఎమ్మెల్యే ఆర్కేకు స్థానికులు వినతిపత్రం అందజేశారని, స్థానికంగా ఉన్న సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో ఆ ప్రాంతం మొత్తం సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించి ప్రధాన రహదారి వెంబడి డ్రెయిన్‌తోపాటు ప్రతి రోడ్డులోను సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్పొరేషన్ ప్రత్యేక నిధుల నుంచి రూ. 48 లక్షలు కేటాయించి సీసీ డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. మరో మూడు వారాల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు. పెనుమాకలో అమరావతి రోడ్ నుంచి హిందూ శ్మశానవాటిక వరకు రెండు వైపులా డ్రెయిన్‌లు నిర్మించేందుకు రూ.27 లక్షలు కేటాయించామని, ఆ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని డీఈ తెలిపారు.

ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగించడం అన్యాయం

సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్: పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగించడం అన్యాయమని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో ప్రధాన రహదారి వెంట ఉన్న ఆరు ఇళ్లను తొలగించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. సమాచారం అందుకున్న సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రాతూరు గ్రామాన్ని సందర్శించి పేదలను కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 30 సవత్సరాలుగా ఇక్కడే నివాసాలు ఏర్పరచుకుని ఉంటున్నామని తెలిపారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారి డి.రమేష్‌బాబును సీపీఎం నాయకులు కలసి మాట్లాడారు. రమేష్‌బాబు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలం కావాలంటే గ్రామ సచివాలయంలో అధికారులను కలసి దరఖాస్తు చేసుకోవాలని అంతేకానీ రోడ్డు వెంట స్థలాలను ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టరాదని వారికి వివరించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి తాము అడ్డుచెప్పబోమని, కానీ ఇళ్లు కోల్పోతున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపాలని, బాధితులకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించి, అప్పుడు ఇళ్లను తొలగించాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ఎఫ్ఐఆర్ కాపీలు దహనం



ఉండవల్లి సెంటర్‌లో ఎఫ్ఐఆర్ కాపీలు దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిరూరల్: ఢిల్లీలోని న్యూస్‌క్లిక్ పత్రిక యజమాన్యం, జర్నలిస్టులపైన మోడీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యాన తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో సోమవారం ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా బయట పెట్టినందుకు న్యూస్‌క్లిక్ పత్రికా యాజమాన్యంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దారుణం అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.ఈశ్వర్‌రెడ్డి, వి.దుర్గారావు, బి.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, బక్కిరెడ్డి, పల్లెకృష్ణ, శౌరిబర్సులం, దశరధరామిరెడ్డి, కె.కరుణ, బాబూరావు, వెంకటయ్య, గోపి, దశరధ తదితరులు పాల్గొన్నారు.